
# బోనస్ అందేనా?



**గద్వాల, నవభూమి:-** కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా రైతులు పం డించి వరి ధాన్యానికి మద్దతు ధరతోపాటు బోనస్ రూ.500 చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటనే మాట మార్చి కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని రేవంత్ సర్కార్ ప్రకటించడంతో ఆదినుంచే రైతులను మోసం చేసే పక్రియ ప్రా రంభించారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా ఎకరాకు ఎటువంటి నిబంధనలు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ఏడాదికి రూ.15వేలు చెల్లిస్తామని చెప్పి దానిని రూ. 12వేలకు కుదించి రైతులను మోసం చేశా రు. సన్నాలకే రూ.500 బోనస్ వస్తుందిలే గిట్టుబాటు ధర రాకున్నా దీంతో సరి పెట్టుకోవచ్చని రైతులు భావిస్తుండగా అదికూడా సక్రమంగా రైతుల ఖాతాలో జమచేయడం లేదు.దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసిన వారంలోగా బోనస్ చెల్లిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మూడు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో బోనస్ చెల్లించక పోవడంతో రైతులు పెట్టుబడుల కోసం నా నా అవస్థలు పడుతున్నారు. ఇటు రైతులకు ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వక, అటు బోన స్ జమ చేయకపోవడంతో రైతులు ఆసాముల దగ్గర తెచ్చుకున్న అప్పులు చెల్లించడంలో జాప్యం జరుగుతుండడంతో వడ్డీ లు కట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. తమకు బోన స్ చెల్లించాలంటూ రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అం దజేసిన ఫలితం శూన్యం. ధాన్యం మాత్రం కొనుగోలు చేశా రు. కానీ బోనస్ వేయడం మరువడంతో ప్రభుత్వం తీరుపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. వెంటనే బోనస్ చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.67వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ప్రభుత్వం కొనుగోలు సెంటర్ల ద్వారా రైతుల నుంచి జోగులాంబ గద్వాల జిల్లాలో 67వేల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేసింది. ఇందు కోసం రైతులకు బోనస్‌గా రూ.33,86,09,800 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రూ. 18,25,87,600 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. ఇంకా జిల్లాలోని రైతులకు రూ.15, 60,22, 200 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉన్నది.దీనికోసం రైతులు ఆందోళన చేస్తున్నారు. ప్రతి గ్రామం లో కొంతమందికి పడడం మిగతా రైతులకు పడకపోవడంతో తమ ఖాతాలో బోనస్ జ మ చేస్తారో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అయిజ మండలంలోని బైనపల్లి, పులికల్, కొత్తపల్లి, మేడికొండ, రాజాపూర్, చిన్నతాండ్రపాడ్, సింధనూర్‌తోపాటు జిల్లా లో చాలా గ్రామాల్లో రైతులకు బోనస్ పడ డం లేదు. వరిధాన్యం అమ్మిన చెల్లింపుల్లో ప్రభుత్వం జాప్యం చేయడంతో రైతులు ప్ర భుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోనస్ రాని రైతుల మాటలు వారి ఆగ్రహం వారి మాటల్లో బోనస్ రాక ఇబ్బంది పడుతున్నాం నేను 116 క్వింటాళ్ల వడ్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ధాన్యం విక్రయించి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు బోన్‌స్ నా ఖాతా లో జమ కాలేదు. నాకు బోనస్ కింద రూ. 58వేలు రావాల్సి ఉన్నది. నాకు రావాల్సిన డబ్బులు రాకపోవడంతో ఆసాముల దగ్గర తెచ్చిన అప్పు చెల్లించలేక పోవడంతో వడ్డీలు మీద పడుతున్నాయి. ప్రభు త్వం ఇటు బోనస్ జమచేయక అటు రైతు భరోసా ఇవ్వక ఆం దోళన చేందాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతుల ఖాతాల్లో బోనస్ జమచేయాలి.ప్రభుత్వం చెప్తున్నదొకటి.. చేస్తున్నదొకటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు.ఎన్నికల సమయంలో ధాన్యం కొనుగోలు చేసిన వారంలోగా బోనస్ రైతు ల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు జమ చేయలేదు. 62 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించా. నాకు రూ.31వేల దాక బోనస్ రావాల్సి ఉంది.నూర్ అహ్మద్, బైనపల్లి, అయిజ మండలం బోనస్ వెంటనే జమచేయాలి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చి న మాట ప్రకారం వెంటనే రైతుల ఖాతాల్లో బోనస్ జమచేయాలి. బోనస్ జమ చేయక పోవడంతో రైతులం ఇబ్బందులు పడుతున్నాం. కొనుగోలు కేంద్రంలో 153 క్విం టాళ్ల ధాన్యం అమ్మా. నాకు సుమారు రూ. 76వేలు రావాల్సి ఉంది. అయితే ధాన్యం అమ్మి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు మా ఖాతాల్లో బోనస్ జమచేయలేదు. ప్రభుత్వం బోనస్ జమ చేయక పోవడంతో ఆందోళనలు చేయాల్సి వస్తుంది. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాల మోసం చేసింది.

నవభూమి

పాలమూరు

అనుబంధం

25 మార్చి ,2025 మంగళవారం పేజిలు:4

www.epaper.navabhoomi.in


# బీసీలను ఆర్థికంగా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

■ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు నిరంజన్ గౌడ్




**కల్వకుర్తి,మార్చ్ 24,నవభూమి:-** కల్వకుర్తి పట్టణ బిజెపి కార్యాలయంలో ఈరోజు పత్రికా సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మొన్న తెచ్చిన బడ్జెట్లో బీసీలకు తీవ్ర అన్యాయం చేసింది తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 56% ఉన్నారని చెప్పి మూడు లక్షల కోట్ల పైగా విడుదల చేసిన బడ్జెట్లో కేవలం 11 వేల కోట్లు ఇవ్వడం దారుణమని అన్నారు ఈ రాష్ట్రంలో బీసీలు 56% ఉన్నప్పుడు బడ్జెట్లో వారికి 1,50,000 కోట్ల పైగా కేటాయించాల్సింది పోయి కేవలం ముష్టి విసిరేసినట్టు 3.6% బడ్జెట్ ని బీసీలకు కేటాయించడం ద్వారా బీసీల మీద ఈరాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కక్ష మరొకసారి బయటపడింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు నేను గొప్ప చేశానని చెప్పుకుంటూ మాటల కోతలే తప్ప చేతలు లేవని మరోసారి తేటతెలమైంది కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పినారు కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో బీసీలకు మీరన్న ప్రకారం 42 శాతం అంటే లక్ష 30 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాల్సిందిగా మేము డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు లేకపోతే మేము పోరాటం ద్వారా బీసీలకు అండగా నిలబడతామని హెచ్చరించారు, బీసీలకు మీరు ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్ని అసెంబ్లీలో తూతు మంత్రంగా బిల్ పాస్ చేసి కేంద్ర ప్రభుత్వం పైకి నెట్టడం అనేది మీరు చేతులు దులుపుకున్నట్టుగా మాకు అర్థమవుతుంది మీకు చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేకమైన ఆర్డినెన్స్ తీసుకువచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించాల్సిందిగా మేము డిమాండ్ చేస్తున్నాం.రాబోయే స్థానిక ఎలక్షన్లో బీసీలు అంతా ఏకమై కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఓటు కూడా రాకుండా బిసి సంఘాలు అన్నీ కూడా తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్, మాజీ మండల అధ్యక్షులు సురేందర్ గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ చందు ముదిరాజ్, బీజేవైఎం జిల్లాజనరల్ సెక్రటరీ ధన్నోజు నరేష్ చారి, బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ మాయని రాజశేఖర్, పట్టణ ఉపాధ్యక్షులు కొల్లూరి శ్రీధర్, నాయకులు పుట్ట చంద్రశేఖర్, నాప శివ, అరవింద్ రెడ్డి, చింటూ, చారి, తదితరులు పాల్గొన్నారు

## పడకేసిన ప్రత్యేక పాలన




2

## అకాల వర్షం.. అపార నష్టం



2

# చనిపోయిన పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం

### భద్రత పథకం ద్వారా పోలీసు కుటుంబాలకు ఆర్థిక భరోసా

### ఇటీవల మరణించిన కుటుంబానికి భద్రత చెక్కులు అందజేసిన ఎస్పీ

### వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి మార్చి 24(నవభూమి ప్రతినిధి):** పోలీసు భద్రత పథకం పోలీసు కుటుంబాలలో కొత్త వెలుగులు నింపుతూ, ఆర్థిక భరోసా కల్పిస్తుందని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసులు పిసి -508 కుటుంబానికి పోలీసు భద్రత నుండి మంజూరైన 8 లక్షల చెక్కును శ్రీనివాసులు భార్య శ్రీలక్ష్మి, కుమార్తె సాహితి వారి కుటుంబ సభ్యులకు కలిసి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ భద్రత చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చనిపోయిన పోలీసుల కుటుంబాలకు పోలీసు శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ది సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని ఆయన చెప్పారు. అదే విధంగా భద్రత స్కీమ్ ద్వారా చనిపోయిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఏఓ సునందన, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్ ఉన్నారు.

# ప్రజావాణిలో 04 ఫిర్యాదులు స్వీకరణ

### వనపర్తి జిల్లా కలెక్టర్ రావుల గిరిధర్

**వనపర్తి మార్చి 24(నవభూమి ప్రతినిధి):**సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలుసూచనలు చేయడమైనది. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 02 భూ ఫిర్యాదులు,01 పరస్పర గొడవల ఫిర్యాదులు, 01 భార్య భర్తలు ఫిర్యాదు ఉన్నాయి. మొత్తం ప్రజావాణి లో 04 మంది ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్సైలకు, సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రామాలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.



# పడకేసిన ప్రత్యేక పాలన

- ◆ పల్లెల్లో కానరాని ప్రత్యేక అధికారులు
- ◆ లోకల్ బాడీ ఎన్నికలు జరిగితేనే గాడినపడనున్న పాలన
- ◆ త్వరగా స్థానిక సంస్థల ఎలక్షన్లు జరపాలి అని కోరుతున్న ప్రజలు
- ◆ మాతృశాఖకె పరిమితమవుతున్న ప్రత్యేక అధికారులు






**కల్వకుర్తి, మార్చి 24,నవభూమి:-**పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది.ఒక్కో అధికారికి మూడు,నాలుగు పంచాయతీలు బాధ్యతలు అప్పజెప్పగించడంతో వారు చుట్టపుచూపుగా గ్రామాలకు రావడంతో పంచాయతీల పాలనఅస్తవ్యస్థంగా మారిపోయింది.మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీలు, పారిశుధ్యం పై పర్యవేక్షణ కొరవడంతో ప్రజల సమస్యలతో సతమతమవుతున్నారు..సంవత్సర కాలంగా.గత ఏడాది జనవరి నెలాఖరు నాటికి సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీంతో పంచాయతీల పాలన వ్యవహారాలను చూసేందుకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వ నియమించింది. ప్రత్యేక అధికారుల పాల మొదలై ఐదు నెలల అవుతుంది,నిధులు లేమికి తోడు తమకున్న శాఖపరమైన విధులే కాకుండా గ్రామాల ప్రత్యేక అధికారుల అదనపు బాధ్యతలు అప్పగించడంతో సదరు అధికారులు పల్లెలను పెద్దగా పట్టించుకోవడంలేదని విమర్శలు వెతుకుతున్నాయి..నామం మాత్రం అయినా పల్లెల మొఖం చూడడం లేదు.దీంతో పంచాయతీలో పర్యవేక్షణ కొరబడింది.ఫలితంగా స్థానికంగా పంచాయతీ కార్యదర్శులపైనే మొత్తం భారం పడుతున్నది.అభివృద్ధి పనులు మరమ్మత్తులు ఆటకెక్కాయి.పంచాయతీ ఖాతాలో ఒక్క పైసా కూడా లేదు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కొన్ని నెలలుగా నిధులు జమ కావడం లేదు దీంతో పంచాయతీ పాలన మొక్కుబడిగే సాగుతోంది.పారిశుద్యం పూర్తి స్థాయిలో జరగడం లేదు.గతంలో చేపట్టిన పనులకే బిల్లులు పెండింగ్లో ఉండడంతో కొత్త పనులు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది.గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పడకపోవడంతో ప్రజల్లో జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. పారిశుద్ధ్య చర్యలు తీసుకోపోతే పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉందని గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మాతృ శాఖకే పరిమితం...గత ఏడాదికి ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికార పాలన ప్రారంభమైంది.మండల,డివిజన్ స్థాయిలోను గెజిటెడ్ ఉద్యోగులకు రెండు మూడు పంచాయతీ బాధితుల పగించారు.ప్రధానంగా మిషన్ భగీరథ నీటిపారుదల శాఖల అధికారులయితే తమ మాతృ శాఖకి పరిమితం అవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.సొంత శాఖ వీధులతో పాటు ఉన్నతాధికారుల సమీక్షలు సమావేశాలకు హాజరు కావడం బట్టి బాధ్యతలు కూడా ఉంటాయి.ఈ విధులను భారం కూడా గ్రామపంచాయతీ కార్యదర్శులపైని వారిపై పడింది..ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు పర్యాయాలు గ్రామాలకు వెళ్లడం లేదనే విమర్శలు ఉండనే ఉన్నాయి.ఫలితంగా స్థానిక పంచాయతీ కార్యదర్శులు,ఎంపీఓ లపై అదనపు భారం పడుతుంది..సమస్యల చిట్కా...పంచాయతీలను ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.మిషన్ భగీరథ పైప్లైన్లు చాలా చోట్ల లీకై నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు.కొన్ని గ్రామాల్లో అయితే పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని చెప్పాలి.ఇక హరితహారం మొక్కలు ఎండిపోతూనే ఉన్నాయి.నర్సరీల సంరక్షణ సరిగా జరగడం లేదు.ఇక పాలకవర్గం ఉన్న సమయంలో అప్పో సప్పో చేసి గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసేవారు.బిల్లులు మంజూరైనప్పుడు తీసుకునేవారు.ఇప్పుడు పంచాయతీలో నిధుల లేమితో ప్రత్యేక అధికారులు పట్టించుకోవడంలో లేదనే విమర్శలు బహటంగానే వినిపిస్తున్నాయి.నిధుల కటకట...గ్రామపంచాయతీలు నిధుల కటకట తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. గ్రామ పంచాయతీ ఖాతాలో డబ్బులు లేవు అత్యవసర పనులు ఖర్చు చేయలేక సతమతం అవుతున్నాయి.పారిశుద్ధ్య కార్మికుల జీతాలు,పైపులు లీకేజీ మరమ్మత్తులు, బోర్ల మరమ్మత్తు పనులు పంచాయతీ ట్రాక్టర్ నెలవారి బ్యాంకు వాయిదా గ్రామాల్లో విద్యుత్ దీపాలు,నెలనెలా విద్యుత్ బకాయిని ఇవన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. నిధులు లేకపోవడంతో ఈ బరువు బాధ్యతను గురించి ప్రత్యేక అధికారులు అంటినట్టుగా వ్యవహారిస్తున్నారు. గ్రామ కార్యదర్శి లే ఎలాగో అలాగా కార్మికులకు జీతాలు సర్దుబాటు చేస్తున్నారు.ఇప్పటికే ఒక్కో గ్రామపంచాయతీ లక్ష రూపాయల నుంచి రెండు లక్షల వరకు అప్పు చేసి చెల్లిస్తున్నారని చెబుతున్నారు.పంచాయతీల ప్రత్యేక అధికారులు ఖర్చు విషయంలో చేతులెత్తేయడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతుంది.నాలుగు రోజులు ఉండిపోయే వాళ్ళమని ప్రత్యేక అధికారులు దాటివేత ధోరణి అనుసరిస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రత్యేక నిధులు 14 నెలలుగా పెండింగ్ లోనే ఉన్నాయి.నిబంధన మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధి కుంటూ పడకూడదు అంటే వీలైనంత త్వరలో ఎన్నికలు జరపాలని కోరుకుంటూన్నారు.

# అకాల వర్షం.. అపార నష్టం

**హన్వాడ, నవభూమి:-** హన్వాడ మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఈ వడగండ్ల వానతో చేతికొచ్చిన వరి పంట నేలమట్టమయ్యాయి. మండలంలోని కోనగట్టుపల్లి, హన్వా డ, సల్లోనిపల్లి, నాయినోనిపల్లి, యారోనిపల్లి గ్రామాల్లో దాదాపుగా 23 ఎకరాలల్లో వడ్లు రాలిపోయి పంటనష్టం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనగట్టుపల్లిలో రమణారెడ్డి అనే రైతు ఐదు ఎకరాలల్లో వరి పంట సాగు చేశాడు. ఆదివారం మిషన్తో కోత కోసేందుకు సిద్ధమవ్వగా రాత్రి కురిసిన వడగండ్ల వానతో ధాన్యం మొత్తం నేలరాలడంతో రైతు లబోదిబో మంటున్నాడు. ప్రకృతి చేసిన బీభత్సంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.నేలకొరిగిన జొన్న పంట చారకొండ, మార్చి 23: మండలంలోని చారకొండ, సి రుసనగండ్ల, మర్రిపల్లి, శాంతిగూడెం, జూపల్లి, తిమ్మాయిపల్లి, తుర్కలపల్లి తదితర గ్రామా ల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుతో వర్షం పడింది. దీం తో పలు గ్రామా ల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, వరి, జొన్న తదితర పంటలు నెలకొరిగాయి. దీంతో రైతులు దిక్కతోచని స్థితిలో ఉన్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



## సాగు నీరందక ఎండుతున్న పంటలు.. కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా



**గద్వాల నవభూమి:-** సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి.. సాగునీరు ఇచ్చి పంటలు కాపాడాలని కోరుతూ ఆర్డీఎస్ రైతాంగం సోమవారం గద్వాల కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అలంపూర్ తాలూకా పరిధిలో ఉండే 16 గ్రామాల రైతులు 20 వేల ఎకరాలలో వరి పంట సాగు చేశామని తెలిపారు. ప్రస్తుతం నీటి సరఫరా నిలిచిపోవడంతో పంటలకు సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు వాపోయారు. తమ పంటలు ఎండకుండా ఈ విషయము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ పంటలు ఎండ కుండా చూడాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫిర్యాదు చేశారు.తుంగభద్ర నదిలో 15 టిఏంసిల నీళ్లు నిల్వ ఉన్నాయని 2 టిఎంసిలు నీటిని వదిలితే పంటలు పండుతాయని రైతులు జిల్లా కలెక్టర్ దగ్గర వేడుకున్నారు. గతంలో ఆర్డీఎస్ నీళ్ల కోసం కర్ణాటక రాష్ట్రంలోని ముఖ్యమంత్రి దగ్గరికి ఊపుకుంటపోయిన నాయకులు నీళ్లు ఎక్కడ తెంచిర్రని రైతులు ప్రశ్నించారు. రైతులకు వెంటనే నీళ్లు వదలి పంటలను ఆదుకోవాలని కలెక్టర్‌కు రైతులు విజ్ఞప్తి చేసారు. వీరికి బీఆర్ఎస్, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

## హామీలు ఇవ్వడమే తప్ప.. అమలు చేయని రేవంత్ రెడ్డి సర్కార్: మాజీ ఎమ్మెల్యే చిట్టెం


**మక్తల్, నవభూమి:-** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇస్తుంది తప్ప అమలు చేయడంలేదని మాచీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. సోమవారం మక్తల్ నియోజకవర్గంలోని ఉట్కూరులో జరిగిన వివాహ వేడుకలకు చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసగించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయిందన్నారు. రాష్ట్రంలోని ఆడబిడ్డ పెండ్లికి కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం అందిస్తామని గ్యారెంటీ లేని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు గడిచినప్పటికీ దానిని నెరవేర్చడంలో రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో పేదింటి ఆడబిడ్డల పెండ్లిని సంతోషంగా చేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. మేనమామ కానుకగా రూ.లక్ష 116 అందించి ఆడబిడ్డ పెండ్లికి పెద్దదిక్కయ్యారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అర్జీ పెట్టుకున్న వారికి పాత పద్ధతి ప్రకారంగానే రేవంత్ రెడ్డి సర్కార్ కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించింది తప్ప, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం చెక్కుతోపాటు తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే వెంబడి బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశి రెడ్డి, గాల్ రెడ్డి, నరసింహారెడ్డి, శివ లతోపాటు తదితరులు ఉన్నారు.



### ప్రైవేట్ స్కూల్లో.. అప్పుడే

# మొదలైన వసూళ్లు

- ఇప్పుడు అడ్మిషన్లు తీసుకుంటే రిబేటు
- ప్రైవేట్ స్కూళ్లో కానరాని కనీస సౌకర్యాలు
- శిక్షణ పొందని అధ్యాపకులే ఎక్కువ
- ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల నియంత్రణ కరువు




**కల్వకుర్తి,మార్చ్ 24, నవభూమిన్యూస్ ప్రతినిధి:-**ప్రైవేట్ స్కూల్లో అప్పుడే అడ్మిషన్ల దుకాణాలు తెరిచాయి. ఇంకా ఈ అకాడమీ ఇయర్ పూర్తికానే లేదు ఇప్పుడే పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రైమరీ స్కూళ్ల పరీక్షలు పూర్తి కానే లేదు.ఫలితాలు ప్రకటించనే లేదు.వేసవి సెలవులు ఇవ్వనేలేదు. కానీ కొత్త అకాడమీ ఇయర్ అడ్మిషన్లు మాత్రం జోరుగా సాగుతున్నాయి.ఆలోచించిన ఆశా భంగం అన్నట్లు సీట్లు అయిపోతున్నాయి అంటూ ప్రచారం సాగిస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్ల నుంచి చిన్న స్కూల్ లో పరీక్షల కోలాహలం కన్నాఅడ్మిషన్ల హడావిడే ఎక్కువగా కనిపిస్తుంది.గతంలో కొత్త అకాడమీ ఇయర్ మొదలైన తర్వాత అడ్మిషన్ల ప్రక్రియ సాగేది. కొంతకాలానికి వేసవి సెలవుల్లో అడ్మిషన్ల సాగించేవారు. కానీ ఇప్పుడు మాత్రం ఏకంగా ఫిబ్రవరి మార్చ్ లోనే స్కూల్లో ముందు ఫ్లెక్సీలు, కరపత్రాలు, ప్రకటనలు, ప్రతి గ్రామంలో తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అడ్మిషన్ల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రుల బలహీనత ఆసరాగా చేసుకుని పుస్తకాలు, యూనిఫామ్, షూజులు, టై బెల్టు వివిధ రకాల వస్తువులు అడ్మిషన్ నాడే అంటగడుతున్నారు.ఇంత దుర్మార్గం గతంలో పెద్దగా కనిపించేది కాదు.ఇప్పుడు కల్వకుర్తిలోని కార్పోరేట్ స్కూల్స్ మొదలుకొని ప్రైమరీ స్కూల్ లతో సహ మండలంలోని వివిధ గ్రామాలలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.చదువుల పేరుతో పేద ప్రజల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు.పెద్ద పెద్ద స్కూళ్లకు దీటుగా ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు.మౌనిక సదుపాయాల కల్పన లో మాత్రం వెనుకబడి ఉంటున్నాయి. నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. విద్య హక్కు చట్టాన్ని యదేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం అలసత్వం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది.కనీస సౌకర్యాలు లేని స్కూల్లో ఎన్నో ఉన్నాయి. ఇరుకైన గదులు, కనీసం ఆట స్థలం కూడా లేకుండా ఉన్నాయి.శిక్షణ పొందని ఉపాధ్యాయులే ఎక్కువ ఇక బోధన విషయానికి వస్తే నిపుణులైన అధ్యాపకులు ఎక్కడా కనిపించరు. అరాకోర చదువులు చదివిన వాళ్లే ఎక్కువగా కనిపిస్తారు.ఒక స్కూల్లో ఉపాధ్యాయుడి నియామకం జరగాలంటే కనీస అర్హతలు నిర్ధారించాల్సి ఉంటుంది. ప్రైమరీ స్కూలు అయితే కచ్చితంగా టిటిసి చేసి ఉండాలి. హై స్కూల్ అయితే బీఈడీ పూర్తి చేసి టెట్ కూడా పాస్ అయి ఉండాలి. ఎందుకంటే టీచర్ అనగానే పాఠాలు చెప్పడం వస్తే మాత్రమే సరిపోదు.. టీచర్ అంటే కనీసం అర్థం అవగాహన లేని వాళ్ళు స్కూల్లో ఏర్పాటు చేస్తున్నారు.ట్రైనింగ్ టీచర్ అయితే బిఈడి,టిటిసిలో విద్యార్థుల మానసిక పరిస్థితులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయిస్తారు. విద్యార్థుల మానసిక సామర్థ్యాలపై పూర్తి ట్రైనింగ్ టీచర్ అవగాహనతో ఉంటారు. చైల్డ్ మెథడాలజీ పై పట్టు ఉన్నవారై ఉంటారు. సైకాలజీ చదువుకొని ఉంటారు. ఏ విద్యార్థికి ఎలా పాఠం చెబితే అర్థం చేసుకోగలరన్న దానిపై పూర్తి జ్ఞానంతో ఉంటారు. అంతేగాని స్కూళ్లను బంధర దొడ్డిలా మార్చి గుంపంతటికి ఒకే విధంగా పాఠం చెబితే అర్థం చేసుకోలేరు. ఒత్తిడిని తట్టుకోలేని పిల్లలకి ఎలా పాఠం చెప్పాలి ఎలాంటి అవగాహనతో బోధించాలన్నది కేవలం ట్రైనింగ్ టీచర్లకు మాత్రమే తెలుస్తుంది. చాలామంది పిల్లలు ఎంతో సున్నితంగా ఉంటారు. అలాంటి వారికి అర్థమయ్యే తరహాలో సబ్జెక్టు పై శిక్షణా పొందిన అధ్యాపకులకే సాధ్యమవుతుంది.కానీ అధికారుల పర్యవేక్షణ అసలే లేదు. ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారో లేదో వేచి చూడాలి.

### ఎస్ఎల్‌బీసీలో 31వ రోజుకు చేరుకున్న రెస్క్యూ ఆపరేషన్..

# సహాయక చర్యల్లో పురోగతి

**అచ్చంపేట నవభూమి:-** దోమలపెంట ఎస్-ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. రెస్క్యూ ఆపరేషన్ ఆదివారం 31వ రోజుకు చేరుకున్నది. టన్నెల్ ఆఫీస్ వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఉన్నతాధికారులతో టన్నెల్ లోపల చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.కలెక్టర్ మాట్లాడుతూ డీ-1, డీ-2 ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు, డి-వాటరింగ్‌ను బయటకు పంపే ప్రక్రియ వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాద ప్రదేశాన్ని మినహాయించి మిగిలిన ప్రాంతాల్లో సహాయక చర్యలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని వివరించారు. సంఘటన జరిగిన నాటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లో 24 గంటల పాటు శ్రమిస్తున్నాయని వెల్లడించారు.సహాయక చర్యల్లో పురోగతి టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) కత్తిరించిన భాగాలను తొలగిస్తూ, వాటర్ జెట్ ద్వారా బురదను తొలగిస్తున్నారు. ఎస్కవేటర్ల ద్వారా మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. ప్రమాద ప్రదేశం వరకు విద్యుత్, వెంటిలేషన్ పునరుద్ధరణ పూర్తయిందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సహాయక బృందాలకు అవసరమైన వసతులు, ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, ఎస్‌డీఆర్ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే, అన్వి రోబోటిక్స్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## రైతు బతుకుపై వడగండ్ల పిడుగు



**మూసాపేట,నవభూమి:-** మండలంలోని వేముల, చక్రాపూర్‌లో ఆదివారం వ్యవసాయ అధికారులు అనిల్‌కుమార్, సురేశ్ పర్యటించారు. ఆకాల వర్షానికి దెబ్బతిన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. వేముల, చక్రాపూర్‌లో మొత్తం 420 ఎకరాల వరి పంట దెబ్బతిన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఇంకా దాసరిపల్లి, చెన్నంపల్లి, నందిపేట, మూసాపేట, తుంకినీపూర్, అచ్చాయిపల్లి, సంలకమద్ది, కొమిరెడ్డిపల్లి, జానంపేట, పోల్కంపల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో అధికారులు పంటనష్టంపై అంచనా వేయాల్సి ఉన్నది.అదేవిధంగా పండ్ల తోటలపై కూడా ఇంకా అధికారులు అంచనా వేయాల్సి ఉంది. మూసాపేట మండలంలోని ఆయా గ్రామాల్లో పెద్ద మొత్తంలో నష్టపోయి ఉంటుందని రైతులు చెప్పే మాటలను బట్టి తెలుస్తున్నది. అధికారులు పంట నష్టంపై అన్నీ గ్రామాల్లో పర్యటించి ఆరా తీస్తారా.. లేదంటే మమా అని సరిపెడుతారో వేచి చూద్దాం..జోరుగా వాన మండలంలో ఆదివారం సాయంత్రం వడగండ్ల వాన జోరుగా కురిసింది. వానకు పం టలు బాగా నష్టపోయాయి. మద్దిగట్ల, వెల్కిచర్ల, పాతమొల్గర, కప్పెటలో ఈదురుగాలికి విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. భూత్పూర్‌లో నీళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

## అరెస్టులతో సర్కారును నడపలేరు

**అయిజ, నవభూమి:-** అరెస్టులతో సర్కారును నడపలేరని ఆశ వర్కర్లు ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆశ వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చలో అసెంబ్లీ ముట్టడికి సీఐటీయూ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం ఆశ వర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడు తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి వెళ్లేందుకు యత్నిస్తున్న తమను పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమం ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన చేస్తున్న ఆశ వర్కర్లను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను పోలీస్ స్టేషన్‌లో ఉంచుకోవడం సమంజసం కాదన్నారు. నిరసన తెలిపేందుకు ప్రజాస్వామ్యంలో హక్కు ఉందన్నారు. హక్కులను కాలరాసే హక్కు ఎవరికీ లే దన్నారు. ఆశ వర్కర్లను ఎంత అణచివేయాలని ప్రయత్నిస్తే అంత ఉవ్వెత్తున ఉ ద్యమం ఎగిసిపడుతుందన్నారు. అనంతరం సోమవారం చలో అసెంబ్లీకి వెళ్లరాదని, తిరిగి ఉదయం పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఎస్సై శ్రీనివాసరావు హెచ్చరించి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.



# వడ కడగండ్లు



**పాలమూరు, నవభూమి:-** మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం రాత్రి కురిసిన ఆకాల వర్షానికి వరి రైతులు భారీగా నష్టపోయారు. ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానకు మహబూబ్‌నగర్ రూరల్ మండలం బొక్కలోనిపల్లి, చౌదర్‌పల్లి, జమిస్తాపూర్, తెలుగుగూడెం, కోడూరులో వరిపంట చెల్లాచెదురైంది. వడగండ్ల చిన్నచిన్న రాళ్ల మాదిరిగా పడడంతో వరిపంట నేలపాలైంది. 25రోజులు అయితే కోసి తినే సమయానికి పంటలో పండిన వడ్లు వడగండ్లకు నేలపాలయ్యాయి. గ్రామాల్లో ఎ క్కడ చూసిన రైతుల ఏడుపులే కనిపించాయి. అకా ల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బోరున విలపించారు. ఎకరాలకొద్దీ సాగుచేసి చేతికొచ్చిన పంట నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం పెట్టుబడికి రైతుభరోసాను కూడా ఇవ్వలేదని అప్పులు చేసి వరి పంట సాగుచేస్తే అకాల వర్షానికి పంట నేలపాలైందని బాధపడుతున్నారు. కౌలు రైతులు కౌలుకు, పంట పెట్టుబడికి అప్పు చేసి పండించిన పంట నేలపాలైందని విలపించారు. ప్రభుత్వం ప్రతిరైతు పంటను పరిశీలించి వారికి నష్టపరిహారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదివారం ఉదయం బొక్కలోనిపల్లి, జమిస్తాపూర్, తెలుగుగూడెంలో వడగండ్ల వానకు పాడైన వరి పంటలను పరిశీలించారు. బొక్కలోనిపల్లిలో కౌలుకు తీసుకొని వరిపంట సాగుచేసిన మహిళా రైతు జ్యోతి మాజీ మంత్రి గ్రామంలోకి రాగానే బోరున విలపిస్తూ తమను ఆదుకోవాలని కంటతడి పెట్టుకుంది.రైతును చూసి చలించిన మాజీ మంత్రి వెంటనే తక్షణ సాయం కింద రూ.5వేలు అందజేశారు. వ్యవసాయ అధికారులకు రైతులు ఫోన్ చేస్తే సెలవుల్లో ఉన్నామని చెప్పగా.. ఎవరూ రాలేదని మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా అధికారులకు ఫోన్‌చేసి వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై అంచన వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగం దిక్కుతోచని పరిస్థితిలో ఉందని తిండితిప్పలు లే కుండా నాటు పెట్టుకు న్న రైతులకు కోత దశలో ఉండగా వడగండ్ల వాన కారణంగా వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు.వడగం డ్ల వాన కారణంగా వరిపంటలు దెబ్బతిన్న రైతులు నష్టపోతే అధికారులు ఎవరూ రాలేదని.. కనీసం రైతులను ఓదార్చడానికి ఎవరూ రాకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శి ంచారు. అదేవిధంగా వరిపంట నష్టపోయిన రైతులకు తక్షణమే రూ.10వేలు, అదే విధంగా ప్రతి ఎకరాకు రూ.40వేల పంట నష్టపరిహారం అందించాలని కోరారు. కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం ఆదుకోకుంటే రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం చేస్తామని తెలిపారు.రైతులకు రైతుభరోసా రాలేదని, రుణమాఫీ, బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. మాజీ మంత్రి వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కోటకదిర పీఏసీసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాఘవేందర్‌గౌడ్, రాజగోపాల్‌యాదవ్, బొక్కలోనిపల్లి మాజీ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.నేలరాలిన మామిడి..జడ్చర్ల, మార్చి 23: జడ్చర్ల మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో మా మిడికాయలు నేలరాయి. మామిడిరైతులు తీవ్రం గా నష్టపోయారు. వడగళ్లతో కూడిన వర్షం కురవడంతో జడ్చర్ల మండలంలోని కిష్టారంలో రైతు గోపాల్‌రెడ్డికి చెందిన 8ఎకరాల మామిడితోటలోని మామిడికాయలతోపాటు పిం దెలు పూర్తిగా నేలరాలాయి. మా మిడికాయలు రాలిపోవడంతో దాదాపు రూ.3లక్షల నష్టం కలిగినట్లు రైతు గోపాల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ మం డలం ఖానాపూర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. ఆరుతడి పంటలకు మం చి పదును లభించింది.నవాబ్‌పేటలో వడగండ్ల వర్షం.మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. సాయం త్రం ఒక్కసారిగా వడగండ్ల వాన కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులకు అక్కడక్కడా మామిడి కాయలు నేలరాలాయి. కొల్లూరు, కాకర్జాల, యన్మన్‌గండ్ల, అమ్మాపూర్ తదితర గ్రామాల శివార్లలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు అకాల వర్షానికి తడిసి పోయి నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు అక్కడక్కడా చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.పెట్టుబడికి అప్పు చేశాం..ఆరెకరాల్లో వరి సాగుచేశాం. రాత్రి పడిన వడగండ్ల వానకు వరి పంట మొత్తం వడ్లు రాలిపోయాయి. వరి పంట మొత్తం గడ్డి మాత్రం మిగిలింది. పంటసాగుకు మొత్తం రూ.లక్షా 90వేలు పెట్టుబడికి అప్పు చేశాం. తెచ్చుకున్న అప్పు ఎలా కట్టాలో దిక్కుతోచట్లేదు. ఒక వైపు రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసే, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుబంధు పడింది. ఇప్పుడు పడలేదు, ఒక దిక్కు వడగండ్ల వర్షానికి పంట నాశనమైంది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి.జయమ్మ, బొక్కలోనిపల్లి, మహబూబ్‌నగర్ మండలం పంటనాశనం అయ్యింది..రాత్రి అకస్మికంగా కురిసిన వడగండ్ల వానకు పంట నాశనమైంది. కష్టపడి అప్పు చేసి, రాత్రి పగలు పొలం వద్ద ఉండి పారవెట్టిన పంట మొత్తం నేలపాలైంది. రాత్రి పెద్దపెద్ద వడగండ్లు పడ్డాయి. ఒకవైపు బోరులో నీరు లేక ఇబ్బందులు పడుతూ నీరు పెడుతున్న సమయంలో నోటికాడికొచ్చిన పంట నేలపాలైంది. రెండున్నర ఎకరా ల్లో పంట సాగు చేశాం. మా భర్త ఆటో డ్రైవర్. సంపాదన లేక వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నాం. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలి.పద్మ, బొక్కలోనిపల్లి, మహబూబ్‌నగర్ మండలం వడగండ్ల వానతో తీవ్రనష్టం..ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్లతో కూడిన వర్షానికి 8ఎకరాల్లో మామిడిచెట్లకు కాయలు రాలిపోవడంతో తీవ్ర నష్టం వచ్చింది. గతంలో మామిడితోటతో ప్రతిఏటా మంచి ఆదాయం వచ్చేది. దాంతో తన కుటుంబ అవసరాలు తీరేవి. ఈ ఏడాది మామిడికాయలు కూడా అంతంతమాత్రంగా కాశాయని, ఆదివారం కురిసిన వడగండ్ల వర్షానికి చెట్టకు ఉన్న కాయలు, పిందెలు పూర్తిగా రాలిపోయాయి. అకాలవర్షానికి పంటపాడైనందునా ప్రభుత్వం ఆదుకోవాలి.

## కేఎల్ఐ కాలువలో యువకుడి మృతదేహం లభ్యం

**బిజినేపల్లి నవభూమి:-** నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారుకొండ గ్రామ సమీపంలోని కేఎన్ఐ కాలువలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాలువ వెంట వెళ్తున్న గ్రామస్థులకు కాలువలో కొట్టుకుపోతున్న యువకుని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుని మృతదేహాన్ని బయటికి తీయించి వివరాలు సేకరిస్తున్నారు.

